సాక్షి ఒడిశా

మంగళవారం । 16 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,45,564లు, బంగారం 1 గ్రాము 150 మిల్లీగ్రాములు, వెండి 46 గ్రాముల 300 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సురక్షితంగా రమేష్



జయపురం సబ్ డివిజన్ పరిధి జయం తిగిరి సమీప పెరాహం డిలోని మిల్లు నుంచి వస్తుండగా కిడ్నాప్ అయిన రమేష్ సుర క్షితంగా ఉన్నారు.

- 8లో



విద్యార్థి కనిపించడం లేదని ఫిర్యాదు

రాయగడ జిల్లాలోని బసంత దేవి విద్యాపీఠం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థి వారం రోజులుగా కనిపించడం లేదని విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

ప్రజాభియోగ శిబిరంలో 170 ఫిర్యాదులు

భువనేశ్వర్: ముఖ్యమంత్రిగా మోహన్ చరణ్ మాఝి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజాభియోగాల శిబిరం చురుకుగా పని చేస్తోంది. సోమవారం నిర్వహించిన శిబిరంలో విచారణ కోసం 170 ఫిర్యాదులు నమోదయ్యాయి. స్థానిక రాష్ట్ర గ్రీవెన్స్ ఛాంబర్‌లో నిర్వహించిన శిబిరంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రత్యక్షంగా పాల్గొని అభియోగాలను ఆలకించి విచారణ చేపట్టారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్‌తో పలువురు ఇతర మంత్రులు పాల్గొన్నారు. అభియోగాల పరిష్కరించి పీడిత వర్గాలకు సత్వర న్యాయం చేకూర్చాలని అనుబంధ శాఖల అధికారులకు ఆదేశించారు.

'తారా' ప్రీమియర్ షో ప్రదర్శన



మాట్లాడుతున్న చిత్ర దర్శక, నిర్మాతలు

జయపురం: స్థానిక ఎస్ఆర్ మాల్‌లో కుందన్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మించిన 'తార' ప్రీమియర్ షో సోమవారం ప్రదర్శించారు. ముఖ్య అతిథిలుగా విద్యావేత్త కుముద మాల మహంతి, నటుడు ప్రకాశ్ చంద్ర మహంతిలు పాల్గొన్నారు. చిత్ర రచయిత, దర్శకుడు జితు మిశ్ర, గాయకుడు ప్రదీప్ సాహులు చలన చిత్ర కథా సారాంశాన్ని వివరించారు. మానవ జీవితంలో ఒకరికి ఒకరు ఎలా సహకరించుకోవాలి, అవయవ దానం మహత్తరం అనే సందేశాన్ని ఇచ్చామన్నారు. భాష, సాహిత్యం, సంస్కృతి, సాంప్రదాయం పరిరక్షణే లక్ష్యంగా చిత్రం రూపొందించామని వివరించారు. ఈ చిత్రం బాబా సాహెబ్ పాల్కే చలన చిత్ర పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికై నట్లు నిర్మాత శుశ్రీ శాశ్వతీ సాహు వెల్లడించారు.

పట్టుబడిన సేవాయత్ వేషధారి



నకిలీ సేవాయత్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని మారు రథయాత్ర పురస్కరించుకుని దేవస్థానం యంత్రాంగం పలు ఆంక్షలు విధించింది. ప్రధానంగా రథాలపై అనధికారిక వ్యక్తుల హాజరు, సెల్‌ఫోన్లు నిషేధించింది. ఈ చర్యల లోపంతో ఈ ఏడాది జరిగిన అడపా పాహండి కార్యక్రమంలో తాళధ్వజంపై బలభద్రుని భారీ విగ్రహం కుప్పకూలి ఎన్నడూ లేని అపచారం జరిగింది. దీంతో బహుడా యాత్రలో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా సీఏవో డాక్టర్ అరవింద కుమార్ పాఢి గట్టి నిఘా వేశారు. దీనిలో భాగంగా సేవాయత్ వేషధారణతో ఒక బూటకపు వ్యక్తి రథాలపై ఉన్నట్లు గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని రథం పైనుంచి దించి వెళ్లగొట్టారు.

న్యాయవాది ఇంట్లో చోరీ



ఇంట్లో ఆధారాల కోసం శోధిస్తున్న పోలీసులు

రాయగడ: స్థానిక రైతుల కాలనీ ఏడో లైన్‌లో నివసిస్తున్న న్యాయవాది నరేంద్ర కుమార్ నిషాల్ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులను విరగ్గొట్టి లోపలికు ప్రవేశించారు. ఇంట్లో అల్మరాలో ఉంచిన విలువైన పత్రాలు, రూ.34 వేల నగదు, ఎల్‌ఈడీ టీవీని దొంగలించారు. ఐఐసీ కేకేబీకే కుహరో తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం బాధితుడు నిషాల్ తన కుటుంబంతో తెరువలిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం నిషాల్ ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహుడానందం



నక్కొచౌణా ద్వారం గుండా తరలి వస్తున్న బలభద్రుని మూల విరాట్

- ఘనంగా ముగిసిన జగన్నాథుడి రథ యాత్ర
- దక్షిణాభిముఖంగా శ్రీమందిరానికి కదిలిన రథాలు
- జనసంద్రమైన పూరీ పట్టణం

భువనేశ్వర్:

నవ దినాత్మక రథయాత్ర నయనానందంగా సాగింది. పవిత్ర ఆషాఢ శుక్ల పక్ష దశమి పురస్కరించుకుని దేవదేవుడు శ్రీజగన్నాథుని తిరుగు ప్రయాణం(బహుడా) మొదలైంది. దీనిలో భాగంగా గుండిచా మందిరం అడపా మండపంపై కొలువైన దేవతామూర్తులను వరుస క్రమంలో (గొట్టి పాహండి) రథాల పైకి తరలించారు. మూల విరాటుల తరలింపు తర్వాత శ్రీజగన్నాథుని ఉత్సవమూర్తి మదన మోహనుడిని నందిఘోష్ రథంపైకి, ఉత్సవమూర్తులు రామకృష్ణులు బలభద్ర స్వామి తాళ ధ్వజంపైకి తరలించారు. శ్రీ జగన్నాథునికి ఉదయం ధూప సేవ తర్వాత గొట్టి పాహండి ప్రారంభించారు. ఉదయం 10.45 గంటలకు ప్రారంభమైన పాహండి 12.55 గంటలతో ముగిసింది. గుండిచా మందిరం సింహద్వారం గుండా ప్రవేశించిన మూల విరాటులు నక్కొచౌణా ద్వారం గుండా వెలుపలికి వచ్చారు. పూరీ గజపతి మహా

రాజా ఛెరా పొంహరా

సేవ ముగియడంతో రథాలపైకి ఎక్కి దిగేందుకు అమర్చిన తాత్కాలిక మెట్లు చారుమళ్లు తొలగించి రథ సారథులు, కొయ్య గుర్రాలను అమర్చిన తర్వాత దేవుళ్ల తిరుగు ప్రయాణం దక్షిణాభిముఖంగా సాగింది. తొలుత బలభద్రుని రథం మధ్యాహ్నం 3.25 గంటలకు, వెంబడి దేవీ సుభద్ర రథం సాయంత్రం 4 గంటలకు, చివరగా శ్రీజగన్నాథుని రథం సాయంత్రం 4.15 గంటలకు బయల్దేరాయి. స్వామివారి దక్షిణాభిముఖ యాత్రలో లక్ష్మీనారాయణుల భేటీ, మౌసీ మా (పిన్నమ్మ) అర్ధాసిని ఆతీ్మయత ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ఆత్మీయుడు జగన్నాథుడు

నవ దినాత్మక యాత్ర పురస్కరించుకుని సర్వ మానవాళికి ఆత్మీయ విలువలను శ్రీజగన్నాథుడు చూపిస్తాడు. గుండిచా మందిరం నుంచి శ్రీమందిరానికి తిరిగి వెళ్లే ప్రయాణంలో దారిలో ఉన్న పిన్నమ్మని పలకరిస్తాడు. ఈ సందర్భంగా స్వామి రాక కోసం ఉవ్విళ్లూరిన పిన్నమ్మ ముందస్తుగా సిద్ధం చేసిన మిఠాయి పొడొ పిఠా రథంపై భగవంతునికి ప్రసాదిస్తుంది. అశేష భక్త జనం మధ్య జరిగే ఈ ముచ్చట వర్ధమాన తరాలకు ఆత్మీయ విలువలపై ప్రేరణ కల్పించడం విశేషం.

లక్ష్మీనారాయణుల భేటీ

పూరీ గజపతి మహారాజు రాయబారంతో లక్ష్మీనారాయణుల భేటీ జరుగుతుంది. రాజ నగరి ఆవరణలో జరిగే ఈ వేడుక ముచ్చట గొలుపుతుంది. ప్రియ సఖి శ్రీమహాలక్ష్మి దేవిని విస్మరించి సోదరి సమేతంగా శ్రీజగన్నాథుడు యాత్రకు వెళ్లడంతో అలక ప్రదర్శిస్తుంది. వీరివురి మధ్య విరహ తెర తొలగించే ప్రయత్నంలో స్వామి సేవకునిగా గజపతి మహారాజా బుజ్జగించడం చూడ ముచ్చటైన వేడుక.

గమ్యం చేరిన రథాలు

పూరీ శ్రీజగన్నాథ స్వామివారి మారు రథయాత్ర విజయవంతంగా ముగిసింది. గుండిచా మందిరం నుంచి బయల్దేరిన 3 రథాలు శ్రీమందిరం సింహ ద్వారం ఆవరణకు సురక్షితంగా చేరాయి. రాత్రి 8.25 గంటలకు బలభద్ర స్వామి, సుభద్ర దేవి రథాలను ప్రధాన ఆలయం ముందు నిలిపారు. అయితే జగన్నాథుని రథం కాస్త ఆలస్యంగా ఈ ప్రాంతానికి చేరింది. బలభద్ర స్వామి తాళధ్వజ రథం ముందుగా సింహ ద్వారానికి చేరిన కొద్ది సమయానికి, సుభద్ర దేవి దర్ప దళనం గమ్యం చేరింది. శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథం గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ రాజ భవనం దగ్గర ఆగింది. ఈ ప్రాంతంలో మహారాజా సమక్షంలో లక్ష్మీనారాయణుల భేటీ ఉత్సవం నిర్వహించారు. తర్వాత రథం తిరిగి బయల్దేరి గమ్యం చేరుకుంది.



దేవీ సుభద్ర విగ్రహం రథంపైకి తరలిస్తున్న సేవకులు



భక్తజనంతో కిక్కిరిసిన శారదాబాలి ప్రాంగణం



దర్ప దళనంపైకి తరలి వెళ్తున్న సుదర్శనుడు



భగవంతుని దర్శనం కోసం నిరీక్షిస్తున్న సాధువులు



నందిఘోష్ రథానికి చేరుతున్న మదన మోహనుడు



రథం లాగుతున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఇతర మంత్రులు

సేవా పేపర్ మిల్లు విశ్రాంత కార్మికుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత కార్మిక నేతలు

జయపురం: స్థానిక యాదవ భవనంలో సేవా పేపర్ మిల్లు విశ్రాంత కార్మికులు ఆదివారం సమావేశమయ్యారు. కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. సబ్ కలెక్టర్ ఆదేశాలతో మిల్లు ప్రధాన అధికారి ఎస్.ఎస్.పాల్ కార్మికులను చర్చలకు ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీంతో చర్చల్లో లేవనెత్తాల్సిన ప్రధాన విషయాలు వెల్లడించారు. ముఖ్యంగా వ్యాపార ట్రాన్స్‌ఫర్ ఒప్పందంలో ఉన్న షరతులన్నీ అమలు చేయాలని, పెన్షన్, పీఎఫ్, గ్రాచ్యుటీ, బకాయిల చెల్లింపులపై యాజమాన్యం తీసుకున్న చర్యలపై నిలదీయాలని నిర్ణయించారు. సమావేశంలో నేతలు బసంత కుమార్ బెహర, సర్వేశ్వర పండ, ప్రహ్లాద్ మల్లిక్, ధృభ బారిక్, రామకృష్ణ మహారాణ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన పొడొ పిఠా

భువనేశ్వర్: మారు రథయాత్రలో శ్రీజగన్నాథుని నందిఘోష్ రథం మార్గమధ్యలో ఆగుతుంది. ఈ సందర్భంగా పిన్నమ్మ (మౌసీ మా) ఆప్యాయతని ఆస్వాదించి స్వామివారు ముందుకు సాగుతారు. పూర్వం శ్రీమందిరం, గుండిచా దేవాలయం మధ్య మాలిని అనే నది ప్రవహించేదని పౌరాణిక గాథ ప్రచారంలో ఉంది. ఫలితంగా వార్షిక యాత్ర కోసం 6 రథాలు వినియోగించే వారు. మాలిని నదికి ఒక ఒడ్డున మౌసీ మా ఆలయం ఉంది. అక్కడి వరకు మూడు పెద్ద రథాలలో విచ్చేసిన దేవుళ్లని ఆవలి ఒడ్డుకు పడవలో తరలించి, మరో 3 రథాల్లో గుండిచా గమ్యం చేరడం జరిగేది. ఇలా సాగుతుండగా ఒకనాడు నదిలో నీటి మట్టం అధికం కావడంతో మూల విరాటుల తరలింపు కష్టతరమైంది. ఈ పరిస్థితిపై మౌసీ మా చింతించి యాత్రను నిరాటంకంగా నిర్వహించడానికి నదిని ఎండిపోయేలా చేసింది. అందుకు కృతజ్ఞతగా వార్షిక మారు రథయాత్ర పురస్కరించుకుని ఏటా స్వామి ఈ ఆలయం ప్రాంగణంలో కాసేపు ఆగి, దేవాలయంలో తయారు చేసిన ప్రత్యేక మిఠాయి పొడొ పిఠా ఆరగించి ముందుకు సాగుతానని చేసిన వాగ్దానం మేరకు ఏటా ఈ ప్రాంతంలో జగన్నాథుని నందిఘోష్ రథం ఆగుతుందని కథనం.

ఫుట్‌బాల్ రిఫరీ ఎంపికలు పూర్తి



ఎంపికల్లో పాల్గొన్నవారికి వివరిస్తున్న మాధవ నాయిక్

జయపురం: ఒడిశా ఫుట్‌బాల్ అసోసియేషన్ ద్వారా నిర్వహించిన ఫుట్‌బాల్ రిఫరీ ఎంపికలు పూర్తయ్యాయి. జయపురం స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన పరీక్షలకు దక్షిణ ఒడిశా జోన్‌లోని 8 జిల్లాల నుంచి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సులోపు యువతీ, యువకులు 80 మంది పాల్గొన్నారు. మొత్తం రెండు రోజుల పాటు శారీరక, లిఖిత పూర్వక పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల్లో పాల్గొన్నవారు ఉత్తీర్ణులైతే తర్వాతి లెవెల్‌కు ఎంపిక చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ప్రధాన రిఫరీ దుర్గా మాధవ నాయిక్ శిక్షకునిగా పాల్గొని శారీరక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా క్రీడా అసోసియేషన్ కార్యదర్శి అనూప్ కుమార్ పాత్రో, జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సురక్షితంగా రమేష్

- 48 గంటల్లో కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు


కిడ్నాపైన రమేష్

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ పోలీసుస్టేషన్ జయంతిగిరి సమీప పెరాహండిలోని మిల్లు నుంచి వస్తుండగా కెనాల్ మార్గంలో కొందరు దుండగులు ఎ.రమేష్ అనే వ్యక్తిని గత శుక్రవారం కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసును 48 గంటల్లో కొరాపుట్ పోలీసులు ఛేదించారు. దీనిలో భాగంగా ముగ్గురు దుండగులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. దుండగులు తీసుకుపోయిన రమేష్ కారుని కూడా పోలీసులు స్వాధీన పరచుకున్నారు. కాగా రమేష్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు అతడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.70 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొరాపుట్ ఎస్పీ ఆదేశాల మేరకు జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి నేతృత్వంలో ఒక పోలీసు టీమ్ గాలింపు ప్రారంభించి ఆదివారం రాత్రి రమేష్ జాడను కనుగొంది. అయితే రమేష్‌ను ఎందుకు అపహరించారు, ఎక్కడ రక్షించారు అనేది మాత్రం వెల్లడించలేదు.

ఆశ్రమ నిర్వహణకు రూ.2లక్షలు విరాళం

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం నిర్వహణకు ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి, ధర్మపురం, తేలకుంచి, హరిపురం గ్రామాలకు చెందిన దాతలు రూ.2,10,000లు విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన దాతలు చట్టి నరేష్‌కుమార్, ప్రీతి దంపతులు. నరేష్ రష్యాలో ఉంటారు. అలాగే ధర్మపురం గ్రామస్తులు రూ.10 వేలు, లొద్దపుట్టి, హరిపురం, తేలుకుంచి గ్రామాల మహిళలు 24 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫారాలు, బూట్లు పంపిణీ చేశారు. ఈ దాతలకు ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

ఉసురు తీసిన ఆస్తి వివాదం

హిరమండలం: ఆస్తి వివాదం ఓ కుటుంబంలో చిచ్చు రేపింది. నిండు ప్రాణాన్ని బలిగొంది. ఎంఎల్ పురం కాలనీలో జరిగిన ఈ ఘటనలకు సంబంధించి హిరమండలం ఎస్ఐ జి.నారాయణస్వామి తెలిపిన వివరాలు ప్రకారం.. ఎంఎల్ పురం కాలనీలో తోణంగి అమ్మన్న కుమారుడు లక్ష్మణరావుతో కలిసి నివాసముంటున్నారు. ఇటీవల కుమారుడు అప్పులపాలయ్యారు. దీంతో తమకున్న 20 సెంట్ల భూమిని విక్రయించడానికి సంతకం పెట్టాలంటూ గత కొద్దిరోజులుగా ఒత్తిడి చేస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం భూమి అమ్మేందుకు సంతకం చేయాలని తల్లి అమ్మన్నతో గొడవ పడగా.. పక్కనే ఉన్న పెద్దమ్మ కోనారి నర్సమ్మ(86) అడ్డుతగిలారు. కోపంలో లక్ష్మణరావు ఆమెపై చేయి చేసుకోగా నర్సమ్మ అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆస్పత్రికి తరలించేలోగానే మృతిచెందింది. అమ్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు సంఘటన స్థలానికి కొత్తూరు సీఐ వేణుగోపాలరావు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి


రామస్వామి(ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన అంబటి రామస్వామి(38) అనే వ్యక్తి సోమవారం రైలు నుంచి జారి మృతి చెందాడు. రామస్వామి లొద్దపుట్టిలోని అత్తవారింట్లో ఇల్లరికం ఉంటున్నా డు. చెన్నైలో వలస కూలీగా పనిచేస్తున్న ఈయన స్వగ్రామానికి వచ్చే క్రమంలో వ్యక్తిగత పనిపై రాజమండ్రిలో దిగి మళ్లీ మరో రైలులో వస్తుండగా, సోమవారం కంచరపాలెం సమీపంలోకి వచ్చేసరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఈయనకు భార్య మీన, ఇద్దరు కుమార్తెలు రుక్మిణీ, వెన్నెల, కుమారుడు ఢిల్లేశ ఉన్నారు.

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి


భర్త చేతిలో తీవ్రంగా గాయపడిన భార్య దుర్గ

ఇచ్ఛాపురం: మద్యం మత్తులో భార్యపై భర్త దాడికి తెగబడిన ఘటన పట్టణంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ముడియా వీధిలో సుదర్శన శ్రీను, భార్య దుర్గ, ఇద్దరు కుమారులతో కొంతకాలంగా నివాసముంటున్నారు. శ్రీను డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా భార్యపై భర్త అనుమానం పెంచుకోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి భర్త జీతం విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో మద్యం మత్తులో ఉన్న శ్రీను ఇంటిలో కత్తి తీసుకుని భార్యపై దాడిచేశాడు. ఆమెకు చేయి, తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె గట్టిగా అరవడంతో చుట్టుపక్కల ఉన్న వారు అక్కడకు చేరుకున్నారు. దీంతో భర్త పారిపోయాడు. స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి బరంపురం పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఏఎస్ఐ గోపాలకృష్ణ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మారు రథయాత్ర



పర్లాకిమిడి: సుభద్ర రథంపై బంగారు చీపురుతో చెరా పహారా చేస్తున్న యువరాణి కల్యాణీ గజపతి, శ్రీజగన్నాథ రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న కల్యాణీ గజపతి



రాయగడ: రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్లో) కల్కీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథుడు

రాయగడ: పట్టణంలో మారు రథయాత్ర కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం గుండిచా మందిరంలో కొలువైయున్న దేవతామూర్తులను రథంపైకి సేవాయుతులు తీసుకొచ్చారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, ఏడీఎం భాస్కర రైతా, తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి తదితరులు పాల్గొన్నారు. పలు సేవా సంస్థలు యాత్రలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

పర్లాకిమిడిలో...

పట్టణంలో మారు రథయాత్ర ఘనంగా నిర్వహించారు. వర్షం పడుతున్నా వేలాది మంది భక్తులు రథం లాగడానికి ఉత్సాహం చూపించారు. ఉదయం తొలుత పూజలు నిర్వహించి శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవుళ్లను పహాండి జరిపి రథాలపై ఎక్కించారు. పర్లాకిమిడి గజపతి వంశీయురాలు యువరాణి కల్యాణీ గజపతి మూడు రథాలపై పూజలు చేసి బంగారు చీపురుతో ఊడ్చారు. అనంతరం భక్తబృందం రాజవీధిలో మౌసీ ఇంటి వద్ద రథాలు నిలుపుదల చేశారు.


పర్లాకిమిడి: బలభద్ర రథం


పర్లాకిమిడి: రథయాత్ర పహండి వద్ద భక్తజనం


రాయగడ: రథంపైకి దేవతామూర్తులను తీసుకొస్తున్న దృశ్యం

బొమ్మలతో బోధన

- కళలు, భాషా, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన
- రాయగడలో ప్రారంభమైన బాలా ప్రాజెక్టు


పితామహల్ ఆశ్రమ పాఠశాల


విద్యార్థులకు బొమ్మల సాయంతో బోధిస్తున్న హెచ్ఎం సాహు

రాయగడ: విద్యార్థులకు ఆధునిక విద్యా విధానంతో పాటు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ పైలట్ ప్రాజెక్టు–2020 పథకం కింద జిల్లాలో బాలా (బిల్డింగ్ ఫర్ లెర్నింగ్ ఎయిడ్) కార్యక్రమాన్ని రాయగడలో ప్రప్రథమంగా ప్రారంభించింది. దీనిలో భాగంగా సదరు సమితి పరిధిలోని పితామహల్ ఆశ్రమ పాఠశాలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివాసీ భాష, సంస్కృతి, కళల పరిరక్షణలో భాగంగా ఆయా అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఆశ్రమ పాఠశాలలో రెండు తరగతి గదుల్లో వివిధ చిత్రాల ద్వారా వారికి అవగాహన కల్పించే విధంగా సన్నాహాలు చేశారు. జిల్లాలోని ఆదివాసీ సంస్కృతికి అద్దంపట్టే చిత్రాలను వేసే చిత్రకారులు గోడలపై బొమ్మలను చిత్రీకరిస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసీ తెగల్లో భాగమైన లంజియా సవర, డొంగిరియా కొందొల భాష, సంస్కృతులకు అద్దంపట్టే చిత్రాలు ఇక్కడ చోటుచేసుకున్నాయి. తరగతి గదుల్లో గణితం, పర్యావరణం, భాష వంటి వాటిని చిత్రాల రూపంలో విద్యార్థులకు బోధించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అతి సులభంగా వారు గణితం, పర్యావరణ వంటి అంశాలను అర్థం చేసుకునే విధంగా చిత్రాలను రూపొందిస్తున్నామని ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ద్వితిచంద్ర సాహు తెలియజేశారు. జిల్లాలోని 100 ఆశ్రమ పాఠశాలల్లో ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు ప్రభుత్వం యోచిస్తుంది. రాయగడ జిల్లాలో ప్రథమంగా ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ లభించిందని వెల్లడించారు.


తరగతి గదుల్లో చిత్రాలు వేస్తున్న దృశ్యం


సంస్కృతికి అద్దం పట్టే చిత్రం


బొమ్మల ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రంలో పేదరికం తగ్గుదల మా ఘనతే

- మాజీ సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ) సూచిక భారత్ 2023–24 విశ్లేషణ ప్రకారం రాష్ట్రంలో పేదరికం తగ్గింది. అయితే గతంలో తమ ప్రభుత్వం సమగ్ర విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం వలనే ఒడిశాలో పేదరికం తగ్గిందని బీజేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ పురోగతిపై ఆయన సోమవారం ఆనందం వ్యక్తం చేశారు. లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేయడంలో ఒడిశా దేశంలోనే అగ్రగామిగా ఉందని తెలిసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎస్డీజీ ఇండియా ఇండెక్స్ 4.0 ప్రకారం రాష్ట్రంలో పేదరికం పరిస్థితి 2020–21 నుంచి 2023–24 వరకు 12 పాయింట్లు మెరుగుపడింది. ఈ పురోగతితో రాష్ట్రం ముందంజ వర్గంలో (ఫ్రంట్ రన్నర్) చేరింది. తాజా విశ్లేషణ ప్రకారం ముందంజ వర్గంలోకి కొత్తగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చేరాయి. ఈ జాబితాలో ఒడిశా ఒకటి కావడం విశేషం. కొత్తగా ఈ జాబితాలో చోటు చేసుకున్న ప్రాంతాల్లో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మణిపూర్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, డామన్ దయ్యూ మరియు దాద్రా నాగర్ హవేలీ ఉన్నాయి.

విద్యార్థి కనిపించడం లేదని ఫిర్యాదు


బసంతదేవి విద్యాపీఠం ఆశ్రమ పాఠశాల

రాయగడ: జిల్లాలో పద్మపూర్ సమితి గుడియాబొందొ గ్రామంలోని బసంత దేవి విద్యాపీఠం ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి గత వారం రోజులుగా కనిపించడం లేదని విద్యార్థి తల్లిదండ్రులు పద్మపూర్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వంద పడకల సామర్థ్యం కలిగిన ఆశ్రమ పాఠశాలో వారం రోజులుగా విద్యార్థి ఆచూకి తెలియడం లేదన్నారు. ఆశ్రమ పాఠశాలలో నిర్వాహకుల నిర్లక్ష్యమే దీనికి కారణమని బాధిత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆశ్రమ పాఠశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గిరిధారి పాణిగ్రహి, అదనంగా జిల్లాలోని గుడారి సమితిలో పెండిలి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆశ్రమ పాఠశాలో పర్యవేక్షణ లోపం కారణంగా ఇటువంటి సంఘటన చోటు చేసుకుందని తెలుస్తోంది. దీనిపై జిల్లా సంక్షేమ శాఖ అధికారికి కూడా బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేశారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్


మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా సమితి జోరావు గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మలాస్‌పదర్, బోడోఖోని, గోవింద్‌పూర్ పంచాయతీల నుంచి మొత్తం 51 వినతులు అధికారులు స్వీకరించారు. వాటిలో గ్రామ సమస్యలు 32, వ్యక్తిగతం 19 ఉన్నాయి. 3 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. నిస్సహాయురాలైన మహిళకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గరవ తిరుపతిరావు, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణ నిధినాయక్, మోహనా సమితి అధ్యక్షుడు రంజన్ శోబోరో, బీడీవో రాజీవ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ (పురుషులు, మహిళలు) సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మీదేవి తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పా రు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ఎంపిక చేసి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని, శిబిరాల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా తుది జట్లకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఆగస్టు 10 నుంచి రాష్ట్రపోటీలు..

గుంటూరు జిల్లా వేదికగా ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయని చెప్పారు. జిల్లా నుంచి ఎంపికచేసిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. జిల్లా ఎంపికల్లో పాల్గొనేందుకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకర ణ పత్రం, ఆధార్‌కార్డు, సాఫ్ట్‌బాల్ ఐడీ కార్డుతో హాజరుకావాలని వారు కోరారు. ఎంపికలు జరి గే ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాఫ్ట్‌బాల్ సంఘ కార్యనిర్వహక కార్యదర్శి ఎంవీ రమణ వద్ద రిపోర్ట్ చేయాలని, వివరాలకు 9441011391 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గరిమెళ్లకు ఘనంగా నివాళి

పోలాకి: శ్రీకాకుళం జిల్లాకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయోద్యమ నేత, కవి, వాగ్గేయకారుడు గరిమెళ్ల సత్యనారాయణ పేరు పెట్టాలని గరిమెళ్ల ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌ఏ భుక్త, బాడాన రాజు డి మాండ్ చేశారు. గరిమెళ్ల 131వ జయంతిని సోమవారం ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ జాతి మరచిన జాతిరత్నంగా గరిమెళ్లను అభివర్ణించారు. అనంతరం గరిమెళ్ల ప్రతిభా పురస్కారాల పేరుతో ట్రస్ట్ సమక్షంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సారకంద.. ఆ ఊరికి అండ


మరదరాజపురం గ్రామానికి ఆనుకుని ఉన్న పంట

- సారకందకు పెట్టింది పేరు మరదరాజపురం
- ఆంధ్రా–ఒడిశాలో పట్టణాలకు ఎగుమతి
- ఊరిలో ఎనభై శాతం కుటుంబాలకు ఈ పంటే ఆధారం

విడదీయలేని బంధం మాది

మా తాతల కాలం నుంచి సారకందను పండిస్తున్నాం. మేం సారకంద తప్పిస్తే ఏ పంటనూ పండించలేము. ఆరుమాసాల పాటు ఈ పంటలను పండించి వచ్చిన ఆదాయంతో బతుకుతాం. తర్లాకోట రాజవంశీయులకు ఈ గ్రామం నుంచి తొలిపంటను ఒకప్పుడు అందించేవాళ్లం. సారకందతో మాకు విడదీయరాని బంధం ఉంది.

– భాస్కర మిశ్రో, సారకంద రైతు, మరదరాజపురం

కాశీబుగ్గ : వందల ఏళ్లుగా అక్కడ ఒకటే పంట పండిస్తున్నారు. తరతరాలుగా ఆ పంట సాగుపైనే ఆధారపడి బతుకుతున్నారు. రాజుల కాలం నుంచి అదే ఆనవాయితీగా బతుకుతున్నారు. పలాస మండలంలోని మరదరాజపురం ఈ ప్రత్యేక సంప్రదాయాన్ని పాటిస్తోంది. ఈ ఊరి సారకంద అంటే చుట్టుపక్కల గ్రామాల వాళ్లందరికీ నోరూరుతుంది. రాజుల కాలం నుంచి ఆ ప్రాంతంలో సారకందను పండిస్తున్న రైతులు ఇప్పటికీ అదే రుచి ఇచ్చే పంటను అందించగలుగుతున్నారు.

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న మహేంద్ర గిరుల నుంచి ఈ ఊరికి గెడ్డ వస్తుంది. ఈ నీటి వనరుతో జనవరి నెల నుంచి వారాల తేడాలో రైతులు భూమిలో దుంప ముక్కలు నాటడంతో అవి మొక్కలుగా మొలకెత్తుతాయి. రోజు విడిచి రోజు నీరు పెట్టడంతో ఐదు నుంచి ఆరు మాసాల్లో మంచి దిగుబడి వస్తుంది. మరదరాజపురంలో ఉన్న సుమారు వందకుపైగా కుటుంబాల్లో ఎనభైశాతం కుటుంబాలు సారకంద మాత్రమే పండిస్తాయి. ఈ గ్రామంలో భూమి లేని వారు సైతం పక్క గ్రామాల్లో రైతుల వద్ద కౌలుకు తీసుకుని ఈ పంటను పండిస్తారు. ఈ గ్రామంలో ఎకరాకు ఐదు టన్నుల పంటను పండిస్తారు.


మరదరాజపురం సారకంద పంట

ఇతర ప్రాంతాలకు ఎగుమతులు

ఈ ఊరికి సరిగ్గా కిలోమీటరు దూరంలో ఒడిశా సరిహద్దు ఉంది. దీంతో చాలా మంది ఒరియా మాట్లాడతారు. జగన్నాథుడిని కొలుస్తారు. రవాణా సౌకర్యం కూడా ఉండడంతో ఒడిశాలోని భువనేశ్వర్, బరంపురం, గుణుపూర్, పర్లాఖిమిడి, గారబంద, రాయగడ, ఇక ఆంధ్రాలో ఏడుకిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస–కాశీబుగ్గ జంటపట్టణాలతో పాటుగా శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, ముఖలింగం, ఎల్ఎన్ పేట, సొంపేట. పూండి ప్రాంతాలకు సారకంద తరలిస్తారు. అలాగే వ్యానుల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌కు కూడా ఎగుమతి చేస్తుంటారు.

కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ


విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఉలక, ఎమ్మెల్యే కద్రక తదితరులు

రాయగడ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాయగడ శాసనసభ నియోజకవర్గం, కొరాపుట్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లాలోని కాసీపూర్‌లో విజయోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించింది. కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రకలకు సమితి ప్రజలు నీరాజనాలు పలికారు. కాసీపూర్‌లోని ఐఫాడ్ కూడలి నుంచి డొంబొవీధి, గౌడవీధులతో పాటు మెయిన్ రోడ్డులో ర్యాలీ కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ సమితి అధ్యక్షుడు అంగద్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ అనంతరం ఎంపీ ఉలక, ఎమ్మెల్యే కద్రకలు కాసీపూర్‌లోని మనికేశ్వరి మందిరంలో ప్రత్యేక పూజలు జరిపించారు. పీసీసీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల కు గెస్టు ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.బాలాజీనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లివలసలో జేఎల్ మ్యాథ్స్ (పురుష అభ్యర్థులు మాత్రమే), కంచిలిలో జేఎల్ కెమిస్ట్రీ (పురుష అభ్యర్థులు మాత్రమే), పాతపట్నం బాలికల పాఠశాలలో టీజీటీ బయోలాజికల్ సైన్సు, పీజీటీ సోషల్ స్టడీస్ (మహిళ అభ్యర్థులు మాత్రమే), ఎచ్చెర్లలో జేఎల్ జువాలజీ (మహిళ అభ్యర్థులు మాత్రమే) పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ, డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల పురుష, మహిళ అభ్యర్థులు వారి బయోడేటాతో పాటుగా పీజీ, బీఈడీ, టెట్ (క్వాలిఫైడ్) ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆదివారంపేటలోని జిల్లా సమన్వయాధికారి కార్యాలయానికి ఈనెల 18 తేదీన ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 08942-279926, 9701736862, 9000314209నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఆలిండియా పోటీలకు ఎస్.కోట ఉద్యోగులు

శృంగవరపుకోట: ఢిల్లీలో సెప్టెంబర్‌లో నిర్వహించనున్న ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మీట్ పోటీలకు ఏపీఎస్ ఆర్టీసీ ఎస్‌కోట డిపో ఉద్యోగులు ఎంపికయ్యారు. ఆర్టీసీ తరఫున పాల్గొనేందుకు ఈనెల 14న విశాఖలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో విజయనగరం జోన్ టీమ్‌కు ఎస్.కోట డిపో మేనేజర్ కె.రమేష్ 1000 మీటర్ల ఫాస్ట్ వాకింగ్‌లోనూ, జావెలిన్ త్రోలో కండక్టర్ జీఎస్ కుమార్, 40 మీటర్ల పరుగులో కండక్టర్ కేఎస్ కుమార్‌లు అర్హత సాధించినట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిని ఎస్‌కోట డిపో ఉద్యోగులు అభినందించారు.

చిన్నారుల ఆచూకీ లభ్యం


బూరప్రసాద్


రాఘవేంద్రరావు

విజయనగరం క్రైమ్: స్థానిక బుచ్చన్నకోనేరుకు చెందిన 13 ఏళ్ల వయస్సున్న బూర ప్రసాద్, బూర్లపేటకు చెందిన డి.రాఘవేంద్రరావు స్కూల్ నుంచి వచ్చి బయటకు వెళ్లిన వారిద్దరూ కనబడకుండా పోయారు. ఈ మేరకు చిన్నారుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. తప్పిపోయిన బాలల విషయంలో ఫిర్యాదు అందుకున్న కొద్ది గంటల వ్యవధిలోనే పోలీసులు వారిని పట్టుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు నాయుడు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం చరణ్ అనే బాలుడితో కలిసి బూరప్రసాద్, రాఘవేంద్రలు విశాఖ వెళ్లిపోయారని, అనంతరం చరణ్ కుటుంబ సభ్యులు వెతికి వారి ముగ్గురిని తీసుకువచ్చారని చెప్పారు. అయితే ప్రసాద్, రాఘవేంద్రలు టిఫిన్ చేసి వస్తామని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని, ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో ప్రసాద్, రాఘవేంద్రల తల్లిదండ్రులకు చరణ్ తల్లిదండ్రులు తెలియజేశారన్నారు. ఈ మేరకు ఆ ఇద్దరి తల్లిదండ్రులిచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగి గంటల వ్యవధిలోనే బుచ్చన్న కోనేరు సమీపంలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు.

మృతుడి వివరాలు లభ్యం

గంట్యాడ: తాటిపూడిజలాశయం (గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం)లో ఆదివారం మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమ య్యాయి. మృతుడిని ఎస్.కోట మండల కేంద్రంలోని శ్రీనివాసకాలనీకి చెందిన మీసాల రామునాయుడిగా పోలీసులు గుర్తించారు. ఎస్.కోట మండలంతో పాటు, గంట్యాడ మండలంలో బొంతలు కుట్టి విక్రయిస్తూ జీవనం సాగించేవాడని పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సీతంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు ఒకటి నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. ఈనెల 12న 17 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు 13వ తేదీన ఆమె అక్క స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యమైన బాలిక ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి విజయనగరం జిల్లా గచ్చలవలస గ్రామానికి చెందిన గొర్లె సింహాచలం నమ్మించి మోసం చేశాడని ఫిర్యాదు చేసింది. తనను విశాఖపట్నంలో ఒక గదిలో పెట్టి పలుద ఫాలు తనపై లైంగికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. చేతులతో కొట్టి గాయపర్చినట్టు వాపోయింది. ఈ ఫిర్యాదుపై పాలకొండ సబ్‌డివిజనల్ ఆఫీసర్ జీవీ కృష్ణారావు దర్యాప్తు చేపట్టి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నైపుణ్యాలతోనే ఉపాధి

విజయనగరం రూరల్: యువత వివిధ కోర్సుల్లో చేరి నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ అన్నారు. వీటి అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్ కేంద్రంలో 'ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం' సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు అందుకోవాలన్నారు. అనంతరం నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి, జిల్లా నైపుణ్యాధికారి నీలం గోవిందరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జిల్లా పరిశ్రమల శాఖ ఐపీఓ కె.వర్ధన్, జిల్లా సీడాప్ డీ మార్టిన్ పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందనలు

విజయనగరం: విశాఖ జిల్లాలో ఆదివారం జరిగిన రెండవ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ కుమార్ కలెక్టర్ ప్రాంగణంలో సోమవారం అభినందించారు. అండర్-14 విభాగంలో తాడుతూరి జోషిత్‌చంద్ర, ఆర్లి పవన్‌తేజ (గోల్డ్ మెడల్), అండర్-10 విభాగంలో బోని చార్విక్ (గోల్డ్ మెడల్), షేక్ నైనిషా (సిల్వర్ మెడల్), బోని గీతశ్రీ (సిల్వర్ మెడల్) సాధించారు. వీరందరినీ డీఈఓ అభినందిస్తూ క్రీడారంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలు కరాటేలో తర్ఫీదుపొందడం మంచిదన్నారు. కార్యక్రమంలో శిక్షకులు పెంకి అశ్విని, హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రధానకార్యదర్శి పొంధ్రంకి సంతోష్‌కుమార్, ఎమ్.అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అందని పుస్తకాలు

- పీపీ-1,2 కిట్లు అందించిన గత ప్రభుత్వం
- ప్రస్తుతం ఇంతవరకు అందని కిట్లు


విజయనగరం పట్టణంలోని జొన్నగుడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులు


పీపీ-1 పుస్తకాలు


పీపీ-2 పుస్తకాలు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేది అంతా పేద పిల్లలే. 3నుంచి 6 సంవత్సరాల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకోవడానికి వస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆంగ్ల బోధనను అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ-1, పీపీ-2 కిట్లు అందించింది. కాన్వెంట్ తరహాలో ఆంగ్ల బోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో అందడం వల్ల గతంలో పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేవారు. బాల్యదశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో పిల్లలు పట్టు సాధించే విధంగా గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పిల్లల బోధనకు సంబంధించి 3 నుంచి 4 సంవత్సరాల లోపు పిల్లలకు ఇంగ్లీష్, మేథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌లకు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లు, 4 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్ అందించాల్సి ఉంది.

పీపీ కిట్లు రావాల్సి ఉంది

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలు ఇంకా రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే పిల్లలకు అందిస్తాం.
– బి.శాంతకుమారి, ఐసీడీఎస్ పీఓ

పాత పద్ధతిలోనే బోధన

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ప్రస్తుతం పీపీ-1,పీపీ-2 పుస్తకాలు అందకపోవడంతో పిల్లలకు పాత పద్ధతిలోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం మొదలై నెల రోజులు దాటినా ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కాన్వెంట్‌లలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇటువంటి తరుణంలో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేవిధంగా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం అదిశంగా చర్యలు చేపట్టడం లేదు. పీపీ-1, పీపీ-2 కిట్లలో ఉన్న పుస్తకాల్లో పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 2499 ఉన్నాయి. ఇందులో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 2206 కేంద్రాలు, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 293 ఉన్నాయి. వాటి పరిధిలో 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయసు పిల్లలు 50,318మంది, 3నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 20, 326 మంది ఉన్నారు. 3నుంచి 6 సంవత్సరాల పిల్లల అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు.

వారం రోజుల్లో సమస్య పరిష్కారం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేద్కర్
- ప్రజా వినతుల పరిష్కార వేదికకు 188 అర్జీలు


విజయనగరం అర్బన్: వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ డీఆర్ అంబేద్కర్, జేసీ కార్తీక్


పార్వతీపురం: అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

విజయనగరం అర్బన్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందే వినతులను ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వారం రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో పరిష్కరించదగిన వినతులను అక్కడే పరిష్కరించాలని జిల్లా కేంద్రానికి వచ్చే పరిస్థితి కల్పించవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజావినతుల పరిష్కారంపై మండల, జిల్లా స్థాయి అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్, జేసీ తదితరులు వినతులను స్వీకరించారు. జిల్లాలోని ఏ మండలంలోనూ అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయన్న మాటే వినిపించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వాటిపై తహసీల్దార్‌లు గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు.

23 నుంచి 27 వరకు ఆధార్ అప్‌డేషన్‌కు ప్రత్యేక డ్రైవ్

ఆధార్‌లో ఆయా వ్యక్తుల తాజా సమాచారంతో అప్‌డేషన్ చేసే నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. దీనిపై విద్యార్థులు, ఆయా వర్గాల ప్రజల్లో అవగాహన కలగజేసి ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లల సమాచారం తప్పనిసరిగా నమోదు చేయడం, 18 ఏళ్లకు పైబడిన వారి సమాచారం అప్‌డేట్ చేయడం, పేర్లలో తప్పుల సవరణ, వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆలస్యంగా హాజరయ్యే అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 188 వినతులు అందాయి.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి: డీఆర్‌ఓ జి.కేశవ నాయుడు

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు అందజేసిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని పార్వతీపురం మన్యం డీఆర్‌ఓ జి. కేశవ నాయుడు అన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, ఆర్డీఓ కె.హేమలత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 129 అర్జీలు అందాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'సహారా' బాధితులకు న్యాయం చేయాలి


ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు, సహారా ఇండియా బాధితులు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: 'సహారా ఇండియా' బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకుడు రెడ్డివేణు కోరారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరెట్ వరకు బాధితులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009-2010 సంవత్సరాల మధ్యలో మొదలైన సహారా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్ బాండ్లకు వ్యతిరేకంగా అక్రమ వసూళ్లు చేశారంటూ ఎస్ఈబీఐ(సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)కేసు మొదలైందన్నారు. సుప్రీం కోర్టు 2012లో 15% వడ్డీతో సహా ఖాతాదారులకు తిరిగి చెల్లింపులు చేయమని ఆదేశాలు జారీ చేసింది కానీ సహారా ఇండియా కంపెనీ ఖాతాదారులు, ఏజెంట్లకు-సుప్రీం కోర్టు, ప్రభుత్వాలకు తెలియకుండా సహారా కంపెనీ క్యూ-షాప్ బాండ్లుగా మార్చివేసి డబ్బులు ఇచ్చేశామని సుప్రీం కోర్టులో పచ్చి అబద్ధాలు చెప్పిందని ధ్వజమెత్తారు. పార్వతీపురం బ్రాంచ్ పరిధిలో సుమారు రూ.100 కోట్లు సహారా సంస్థద్వారా బాధితులకు రావాల్సి ఉందని చెప్పారు. సహారా సంస్థ చేసిన మోసాలను సరిచేస్తూ ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం సొమ్ము జమచేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, సహారా ఇండియా బాధితులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


రమణమ్మ మృతదేహం

గంట్యాడ: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన కె.రమణమ్మ (40) పొలంలో పనిచేస్తుండగా గత నెల 28 వతేదీన పాము కాటుకు బారిన పడడంతో కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స తర్వాత పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఫిర్యాదు మేరకు గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

పార్వతీపురంటౌన్: ఎదురెదురుగా రెండు మోటార్ సైకిల్స్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన సిరిపురం ఉపేంద్ర నవజ్యోతి చానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు బొంగు శ్రీధర్‌ను తీసుకుని మోటార్ సైకిల్‌పై వైకేఎం కాలనీకి వెళ్తున్నాడు. అదే సమయంలో పార్వతీపురం మండలం పెద బొండపల్లి గ్రామానికి చెందిన బంది అజయ్ మోటార్ సైకిల్ పై పార్వతీపురం వైపు వస్తుండగా మార్గమధ్యంలో వెంకంపేట గోరీలు దాటిన తరువాత వాటర్ ప్లాంట్ ఎదురుగా ఎదురెదురుగా ఒకరినొకరు ఢీ కొట్టారు. ఈ సంఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే108లో జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

50 సారా ప్యాకెట్ల పట్టివేత

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామ సమీపంలో సారా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని ఎస్సై నరసింహమూర్తి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దత్తిరాజేరు మండలం చొదంతివలస గ్రామానికి చెందిన అలజంగి సూరిబాబు సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకుని 50 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

భీమసింగి సుగర్స్‌ను తెరిపించండి


వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాలోని చెరకు రైతులకు ప్రధాన ఆదరువుగా ఉండే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. కలెక్టరేట్‌లో సుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ విక్టర్‌రాజ్, డిప్యూటీ కేన్ కమిషనర్ సత్యనారాయణను కలెక్టరేట్‌లో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేశ వ్యాప్తంగా పెట్రోల్‌లో కలిపే ఇంధనాల్ కొరత తీవ్రంగా ఉన్న కారణంగా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని ఇంధనాల్ పరిశ్రమగా, లేకుంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా, యువతకు ఉపాధి చూపించే స్కిల్స్ సెంటర్‌గా మార్చాలని కోరారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కర్మాగారంలో భాగస్వామ్యంగా ఉన్న 16,873 మంది రైతులు, 3,500 మంది నాన్‌షేర్ హోల్డర్స్, 543 గ్రామాల ప్రజలకు మంచిజరగాలన్న విషయం మర్చిపోరాదన్నారు. ఆయన వెంట జాగరపు ఈశ్వరప్రసాద్, గొర్రపాటి శ్రీనివాసరావు, సిరికి అప్పారావు ఉన్నారు.

వేడుకగా ప్రతిభా పురస్కార మహోత్సవం

- పేద విద్యార్థుల అభ్యున్నతికి బ్రాహ్మణ సమాఖ్య ప్రోత్సాహం
- రూ.24 లక్షల విలువైన 568 బహుమతుల అందజేత


పసిడి పతకాలు అందుకున్న విద్యార్థులతో సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఎల్లప్పుడూ తమ వంతు ప్రోత్సాహం అందిస్తూనే ఉంటుందని సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వివేదుల రామమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జ్ఞాన సరస్వతి ఆలయంలో సోమవారం ప్రతిభా పురస్కార మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతిభ, ఆదాయ పరిమితుల ప్రాతిపదికన వివిధ స్కాలర్ షిప్‌లు, నగదు, విద్యాదత్తత, రూపంలో 9వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థుల వరకూ బ్రాహ్మణ సమాఖ్య అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం టెన్త్, ఇంటర్‌మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆదాయ పరిమితి లేకుండా బంగారు పతకాలను అందజేశారు. ఎల్‌కేజీ నుంచి పదోతరగతి వరకూ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, షూస్, నోట్‌బుక్స్, పెన్స్, వాటర్ బాటిల్స్‌తో కూడిన గిఫ్ట్ హ్యాంపర్స్ అందించారు. సమాఖ్య చైర్మన్ దామరాజు పర్వతాలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తమవంతు బాధ్యతగా సాయమందిస్తున్నామని తెలిపారు. సమాఖ్య అధ్యక్షుడు పీవీ.రమణమూర్తి కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ప్రియ అతిథిగా కేంద్రీయ విద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నాగమణి, ఆత్మీయ అతిథిగా ఈశ్వర రామ సోమయాజులు (రాంజీ)లు పాల్గొన్నారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ.శ్రీకాంత్, కార్యదర్శి వారణాసి నరసింహమూర్తిలు నాలుగు దశాబ్దాల కాలంలో సంస్థ సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో భరద్వాజ చక్రవర్తి, భోగరాజు సూర్యలక్ష్మి, సత్యకామ్, ధవళ వెంకటరావు, భోగరాజు బాబూజీ, జీఎస్.రావు, షీలా, శైలజ, లలిత, లక్ష్మీజ్యోతి , అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- వామపక్ష నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష ప్రారంభం


కలెక్టరేట్ ఆవరణలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వామపక్ష నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని శివ్వాం గ్రామ దళితులను కొట్టిన పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలని, దళితుల భూములు దళితులకు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివ్వాంలో దళితులకు 1970వ సంవత్సరంలో శివ్వాం రెవెన్యూ సర్వే నంబర్ 20 నుంచి 30 వరకు 14 మందికి 22 ఎకరాల 80 సెంట్ల భూమికి డీపట్టాలిచ్చారని అప్పటినుంచి దళితుల సాగు చేసుకుంటున్నారన్నారు. శివ్వాం గ్రామంలో కొంత మంది పెత్తందారులకు ఆ భూమిపై కన్ను పడిందని, ఆ భూమిని ఎలాగైనా కొట్టేయాలని భావించి దళితులకు ఇచ్చిన భూముల సర్వే నంబర్లకు సంబంధం లేకుండా సర్వే నంబర్ 102లో హద్దులు వేసి ఫేక్ ఇంజక్షన్ ఆర్డర్‌ను కోర్టు వారిని తప్పుపట్టించి తీసుకువచ్చారని ఆరోపించారు. అప్పటినుంచి రెవెన్యూ, పోలీస్ శాఖలు శివ్వాంలో ఉన్న దళితులను భూమి మీదికి వెళ్లొద్దని దౌర్జన్యం చేశారంటూ ధ్వజమెత్తారు.

చాలా దుర్మార్గం

గతంలో సాగు చేసిన వరిచేలను దళితులు కళ్లాలకు తెచ్చుకోగా పోలీసు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి వరి పంటను పెత్తందారులకు అప్పజెప్పారని మండిపడ్డారు. ఇది చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం దళితులు నారు పోసి వరి నాట్లు వేయడానికి సిద్ధం చేస్తుండగా పెత్తందార్లు వచ్చి దాడి చేసి ఐదుగురు దళితుల్ని గాయపరిచారని, తిట్టి కొట్టారని, దానిపై పాలకొండ డీఎస్పీ విచారణ చేసినప్పటికీ ఇంతవరకు ఒక్క పెత్తందారును కూడా అరెస్ట్ చేయలేదన్నారు. దళితులను కొట్టి తిట్టిన పెత్తందార్లను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొల్లి గంగనాయుడు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథ రావు సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, బి.వెంకటరమణ, సీపీఐ నాయకులు జీవన కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య బంకర్ సూరిబాబు, పాలమెట్ట రాము పాల్గొన్నారు.

సమస్యల తక్షణ పరిష్కారం: అదనపు ఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్


ఫిర్యాదు దారుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 29 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీ సీఐలు కేకే వీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి 12 ఫిర్యాదులు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ 12 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల సమస్యలను ఆయన తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ ఈ సందర్భంగా ఫిర్యాదు దారులకు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్సై గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


సీతంపేట: సమస్యలపై కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కళావతి వినతి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సీతంపేట ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌లకు వినతిపత్రం అందజేశారు. భారీగా అర్జీదారులు రావడంతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కిటకిటలాడింది. మొత్తం 142 అర్జీలు ఈ కార్యక్రమానికి వచ్చాయి. సీతంపేట ఏజెన్సీలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిపి 90 రకాల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కళావతి విన్నవించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా మన్యంలో జ్వరాల వ్యాప్తి ఎక్కువగా ఉన్నందున చాలీచాలని మందులు పీహెచ్‌సీల్లో ఉన్నాయని, దోమ తెరల పంపిణీ లేదని విమర్శించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అవసరమైన చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగులకు డీఎస్సీ ప్రిపరేషన్‌కు టెట్, డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాలకొండ ఆర్డీవో ఎస్‌వీ రమణ, ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీపీవో బి.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రభాకర రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ సింహాచలం, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ రామచంద్రరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, డీఈవో పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.